# తోడు



రామ్‌గోపాల్ తల వంచుకుని ఇంట్లోనుంచి వస్తున్నాడు. అక్కడే నిల్చుని వున్న ఉదయినిని చూడ లేదు.

"గుడీవినింగ్ సార్!"

రామ్‌గోపాల్ తలెత్తి చూశాడు.

ఉదయిని నవ్వుతూ కనిపించింది.

"ఉదయినీ! నువ్వేంటి ఇక్కడ?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఇక్కడే మా ఇల్లు."

"ఐ.సీ."

"మీరేంటి సార్! ఆ ఇంట్లోనుంచి వస్తున్నారు?"

"నాకే రూమ్ కావాలి. టూలెట్ బోర్డుంటేను..."

"ఔను. అప్‌స్టైర్‌లో ఖాళీ వుంది. చూశారా?"

"చూడలేదు."

"ఏం?"

"నేను బేచ్‌లర్‌నని ఇవ్వడానికి ఒప్పుకోలేదు."

ఉదయిని నవ్వింది.

"ఆవిడదంతా చాదస్తం."

"ఎవరి భయం వారిది. మనమేం చేస్తాం?"

"బేచ్‌లర్స్ తెలిసిన వాళ్ళ ద్వారా ఎండార్స్ చేయించుకుని వెళ్తేగాని నమ్మరు. మీకు ఆ పోర్షన్ నేనిప్పిస్తాను. రండి."

"నువ్విప్పిస్తావా?" ఆశ్చర్యంతో అడిగాడు రామ్‌గోపాల్.

"యస్."

**- వాణిశ్రీ**

ఉదయిని ఆ ఇంట్లోకి దారితీసింది. రామ్‌గోపాల్ అనుసరించాడు.

ఆమె కాలింగ్ బెల్ నొక్కింది.

సుజాత తలుపులు తెరిచింది. ఉదయినిని, ఆమె వెనుక నిల్చున్న రామ్‌గోపాల్‌ని చూసింది.

"బేచ్‌లర్స్‌కి ఆ పోర్షన్ ఇవ్వనన్నానుగా!..." ముఖం చిట్లించి అన్నది సుజాత.

రామ్‌గోపాల్ ఇబ్బందిగా ఉదయిని వైపు చూశాడు.

ఉదయిని చొరవగా లోపలకి వెళ్తూ "మీరు రండి సార్!" అన్నది.

"ఏంటి చెప్తుంటేను.." విసుక్కుంది సుజాత.

"మమ్మీ ఈయన రామ్‌గోపాల్‌గారు. మా కాలేజీలో లెక్చరర్" పరిచయం చేసింది ఉదయిని.

రామ్‌గోపాల్ ఆశ్చర్యంతో నోరు తెరిచాడు.

"ఇది మీ ఇల్లా?... ఐతే ఈవిడ మీ అమ్మ...!"

"యస్. మా ఇల్లే. మా అమ్మే"అని నవ్వింది ఉదయిని.

రామ్‌గోపాల్ ముఖంలో సంతృప్తి కనిపించింది. 'హమ్మయ్య' అనుకుంటూ సోఫాలో కూర్చున్నాడు.

ఉదయిని ఫ్యాన్ వేసి, టీ.వి. ఆన్‌చేసింది.

"మీరు చూస్తూ వుండండి..."అని లోపలకు వెళ్ళింది ఉదయిని.

"ఏమిటే నువ్వు? బేచ్యులర్స్‌కి ఆ పోర్షన్ ఇవ్వగూడదనుకున్నాం గదా! నేనివ్వనని చెప్పాను అతనికి. మళ్ళీ వెంటబెట్టుకుని వచ్చావెందుకు?" కూతుర్ని కోప్పడింది సుజాత.

"మమ్మీ! ఆయన మా లెక్చరర్. జెంటిల్‌మేన్." అన్నది ఉదయిని.

"ఆఁ... జెంటిల్‌మేన్. ఒక్కడే అంత అద్దె ఇస్తాడా? ముందు ఒక్కడే దిగుతాడు. తర్వాత మరో ఇద్దరు, ముగ్గుర్ని చేరుస్తాడు. రూములో తాగుడు... తందనాలు."

"మమ్మీ! చెప్పానుగా! ఆయన అటువంటివాడు కాదని. చూస్తే తెలియడంలా!"

"మొఖం చూస్తే ఏం తెలుస్తుంది?"

"మమ్మీ! నో డిస్కషన్. ఆ పోర్షన్ ఆయనకి ఇవ్వాల్సిందే. ఇస్తున్నాం అంతే."

"మొండి శిఖండి.." విసుగ్గా అన్నది సుజాత.

"సర్లే. కాఫీ పెట్టు సార్‌కి." నవ్వుతూ అన్నది ఉదయిని.

ఉదయిని ప్లేట్లో స్వీట్, బూంది పెట్టుకుని రామ్‌గోపాల్ ముందు టీపాయ్ మీద పెట్టింది.

"ఏమిటిది?"

"ఏవుంది. జస్ట్ స్వీట్. మీరు కానివ్వండి" అన్నది.

"మీ మమ్మీకి ఇష్టం లేనట్టుంది..."అన్నాడు రామ్‌గోపాల్.

ఉదయిని నవ్వింది.

"ఆమెకి ఎవరూ నచ్చరు. అంతే."

తర్వాత ఉదయిని రామ్‌గోపాల్‌ని వెంటబెట్టుకుని మేడపైన పోర్షన్ తాళం తీసి చూపించింది.

మేడపైన డబుల్ బెడ్‌రూమ్ పోర్షన్ చాలా బాగుంది. మార్బుల్ ఫ్లోరింగ్, కప్‌బోర్డ్సు, అంతా మోడరన్‌గా వుంది. ముందు చాలా ఖాళీ వుంది. చుట్టూ కొబ్బరి చెట్లు ఎత్తుగా పెరిగి నీడనిస్తున్నాయి. మామిడి చెట్టు కొమ్మలు ఖాళీ స్థలంలోకి చొచ్చుకుని వచ్చాయి.

"వండ్రఫుల్! చాలా బాగుంది" అన్నాడు రామ్‌గోపాల్.

"మీకు నచ్చిందికదా?" అడిగింది ఉదయిని.

"నచ్చక చస్తుందా? నా అవసరం. బేచ్‌లర్‌నని ఎవరూ అద్దెకు ఇవ్వడంలేదు. నువ్వు నా స్టూడెంట్‌వి కాబట్టి ఏదో మొఖమాటానికి ఒప్పుకున్నావు." నవ్వుతూ అన్నాడు రామ్‌గోపాల్.

"మొఖమాటం ఏం లేదు సార్! నెలనెలా టంచన్‌గా అద్దె ఇవ్వాల్సిందే." నవ్వింది ఉదయిని.

"ష్యూర్."

"అంతే కాదు. నాకు ఫ్రీగా ట్యూషన్ చెప్పాలి. నో ఫీజ్."

"ష్యూర్...ష్యూర్..." అంటూ పర్స్ తీసి డబ్బు ఇవ్వబోయాడు.

"సార్! మీరు అడ్వాన్సు ఓనర్‌కి ఇవ్వండి" అన్నది ఉదయిని.

"ఏమిటే నువ్వు? బేచ్యులర్స్‌కి ఆ పోర్షన్ ఇవ్వగూడదనుకున్నాం గదా! నేనివ్వనని చెప్పాను అతనికి. మళ్ళీ వెంటబెట్టుకుని వచ్చావెందుకు?"

"ఓనర్‌కా...!"

"యస్. మా మమ్మీ ఓనర్. నేను కాదు."

రామ్‌గోపాల్, ఉదయిని నవ్వుకుంటూ మెట్లు దిగి వస్తుంటే అక్కడే నిలబడి వున్న సుజాత గబగబా లోపలకు వెళ్ళిపోయింది.

"మమ్మీ... మమ్మీ!" పిలిచింది ఉదయిని.

సుజాత వరండాలోకి వచ్చింది. నేల చూపులు చూస్తూ నిల్చుంది.

"మమ్మీ! సార్‌కి పోర్షన్ నచ్చింది. అడ్వాన్స్ తీసుకో" అన్నది ఉదయిని.

"టూ మంత్స్ అడ్వాన్స్ మేడమ్!" రామ్‌గోపాల్ డబ్బు తీసి ఇవ్వబోయాడు.

సుజాత అతనివైపు చుర చుర చూసింది.

"నన్ను మేడమ్ అని పిలవనవసరం లేదు." సీరియస్‌గా అంది సుజాత.

"సరే! ఏమని పిలవాలి?" అడిగాడు రామ్‌గోపాల్.

"పిలవాల్సిన అవసరం ఏమిటి?"

"అవసరాలు అనేకం వుంటాయి. ఒకరితో మరొకరికి అవసరం వుండదా?" అన్నాడు.

"ఉంటే వుంటాయి. నన్ను పేరుతోనే పిలవవచ్చు."

"సరే సుజాత గారూ." నవ్వు ఆపుకుంటూ అన్నాడు రామ్‌గోపాల్.

సుజాత డబ్బు తీసుకుని సీరియస్‌గా లోపలకు వెళ్ళిపోయింది.

"మీరేం ఫీలవ్వకండి. మమ్మీ కొంచెం రఫ్‌గా బిహేవ్ చేస్తుంది కాని మనసు మంచిదే." అన్నది ఉదయిని.

"ఇట్స్... ఓ.కె." అన్నాడు రామ్‌గోపాల్.

తర్వాత 'బై'చెప్పి వెళ్ళిపోయాడు. అతను వెళ్తుంటే చూస్తూ వుండిపోయింది ఉదయిని.

రామ్‌గోపాల్‌కి నలభై దాటి వుంటాయి. చెంపల దగ్గర తెల్లగా నెరుస్తున్నా చూడ్డానికి అంత వయస్సు వున్న వాడిలా వుండడు.

స్టూడెంట్స్‌తో కలిసి పోతాడు. ఇంజనీరింగ్ కాలేజీ స్టూడెంట్స్‌కి పాఠాలు చెప్పే మాస్టారని ఎవరైనా చెప్పినా నమ్మరు. ఎత్తుగా, ఆకర్షణీయంగా వుంటాడు. ఆయన భార్య చనిపోయిందనీ, పిల్లల్ని వాళ్ళ అమ్మమ్మ పెంచి పెద్ద చేస్తున్నదనీ చెప్పుకుంటారు. ఆ విషయాలు ఉదయినికి కరెక్టుగా తెలీదు. మంచి పర్సనాల్టీ, మంచి ఉద్యోగం వున్న అతను మళ్ళీ పెళ్ళి ఎందుకు చేసుకోలేదో? అని అందరూ అనుకుంటూ వుంటారు. ఆ విషయాలు అడిగే చనువు ఎవరికీ ఇవ్వడు కూడా.

❖ ❖ ❖

రామ్‌గోపాల్ ఉదయిని వాళ్ళింటి పైపోర్షన్‌లో చేరిపోయాడు. ఇల్లు సర్దడంలో ఉదయిని అతనికి సహాయం చేసింది. వచ్చిన రోజు తమ ఇంట్లోనే డిన్నర్‌కి ఆహ్వానించింది. రామ్‌గోపాల్ మొఖమాటపడి వద్దు, వద్దు అంటున్నా బలవంతం చేసి తీసుకెళ్ళింది.

సుజాత డైనింగ్ టేబుల్ మీద డిష్‌లన్నీ సర్ది ప్లేట్లు పెట్టి వెళ్ళిపోయింది. తమతోపాటు డిన్నర్ చెయ్యమని అడిగితే రాలేదు.

ఉదయిని రోజూ కాలేజీకి బస్సులో వెళ్ళి వస్తుంది.

"ఉదయినీ! నేను సమయానికే బయల్దేరుతున్నాను గదా! నా కారులో రావొచ్చు." అన్నాడు రామ్‌గోపాల్.

"సరే సార్!"అని రోజూ రామ్‌గోపాల్ కారులో కాలేజీకి వెళ్ళి వస్తున్నది ఉదయిని.

సుజాత కూతుర్ని కోప్పడింది.

"కాలేజీ బస్సు నీకు కన్వీనియంట్‌గానే వుంది కదా! ఎందుకు అతని కారులో వెళ్ళడం?" అన్నది.

"తప్పేంటి?"

"చూసేవాళ్లు ఏమనుకుంటారు?"

"లక్ష అనుకుంటారు. నాకు సార్‌తో వెళ్ళిరావడం కన్వీనియంట్‌గా వుంది. బస్సుకోసం వెయిట్ చెయ్యడం. దారినపోయే వెధవల జోకులు తప్పిపోయాయి. ఇప్పుడు హాయిగా వుంది. స్టడీకిగూడా టైమ్ మిగులుతుంది. ఎవరో ఏదో అనుకుంటే నాకేంటి?"

"మనం సంఘంలో వుంటున్నాం. ఎవర్నీ లెక్కజెయ్యకపోతే ఎలా? నీకు చెడ్డ పేరు వస్తే పెళ్ళెలా అవుతుంది?"

ఉదయిని పకపకా నవ్వింది.



"లక్ష అనుకుంటారు. నాకు సార్‌తో వెళ్ళిరావడం కన్వీనియంట్‌గా వుంది. బస్సుకోసం వెయిట్ చెయ్యడం. దారినపోయే వెధవల జోకులు తప్పిపోయాయి. ఇప్పుడు హాయిగా వుంది. స్టడీకిగూడా టైమ్ మిగులుతుంది. ఎవరో ఏదో అనుకుంటే నాకేంటి?"

"మమ్మీ! నా పెళ్ళి గురించి దిగులు పడకు. ఇనా కొన్ని నెలల్లోనే నా చదువు పూర్తవుతుంది. ముందు జాబ్ రావాలి. అందులో సెటిల్ కావాలి. తర్వాతే పెళ్ళి. నువ్వు పాత చింతకాయ పచ్చడి మాటలు చెప్పకు. నేను వెళ్ళిన తర్వాత నువ్వు ఒంటరిగా ఎలా వుండగలవో ఆలోచించుకో. నా గురించి వర్రీ అవకు." అన్నది.

సుజాత మొఖం మాడ్చుకుని వెళ్ళిపోయింది. మోహన్‌తో పెళ్ళవడం, కాపురానికి వచ్చి ఉదయిని పుట్టాక పేచీ పెట్టుకుని విడాకులిచ్చి మరొక పెళ్ళి చేసుకుని లండన్ వెళ్ళిపోవడం గుర్తొచ్చి ఏడుపు వచ్చింది. ఒంటరిదాన్నని అందరికీ చిన్న చూపు అనుకుని బాధ పడింది.

ఫైనల్ ఇయర్ ఎగ్జామ్స్ దగ్గరికి వచ్చేసరికి ఉదయిని మేడపైకి వెళ్ళి రామ్‌గోపాల్ దగ్గరే స్టడీ అవర్స్ గడుపుతోంది. ఒక్కోసారి రాత్రి పదకొండు, పన్నెండు గంటలవరకు గూడా!

"నువు మరీ టూమచ్‌గా బిహేవ్ చేస్తున్నావే. రాత్రిళ్ళు అతని ఇంట్లో అంతసేపు వుండాల్సిన అవసరం ఏమిటి? స్టడీ స్టడీ అంటావు. నీతోపాటు చదువుకుంటున్న వాళ్ళు లెక్చెరర్లతోపాటు స్టడీస్ చేస్తున్నారా?"అని మందలించింది సుజాత.

"మమ్మీ! డోంట్ బీ సిల్లీ. అవకాశం వుంది కాబట్టి సార్ దగ్గర స్టడీ చేస్తున్నాను. అందరితో కంపేర్ చేస్తావెందుకు?"

"నీకేం? అంతా నన్నే అంటారు." అన్నది సుజాత.

"ఏమంటారు?" తీవ్రంగా అడిగింది ఉదయిని.

సుజాత కోపంగా చూసి వెళ్ళిపోయింది.

ఉదయినికి ఫైనల్ ఇయర్ ఎగ్జామ్స్, ప్రాక్టికల్స్ గూడా పూర్తయ్యాయి. ఇక కెరీర్ గురించి కోర్సులు చెయ్యడం మొదలుపెట్టింది. దానికి రామ్‌గోపాల్ గైడ్ చేస్తున్నాడు.

అప్పుడప్పుడూ సినిమాకు వెళ్ళామనీ, హోటల్లో డిన్నర్ చేశామనీ చెప్పసాగింది ఉదయిని.

సుజాత ఆందోళన పడసాగింది.

"ఎగ్జామ్స్ అయిపోయాయిగా! ఇంకా ఏం చేస్తున్నావు? ఇంకా స్టడీసేనా?" అసహనంతో అడిగింది సుజాత.

"ఔను మమ్మీ! అంతా అమెరికా వెళ్తున్నారు. నేను అదే ప్రయత్నంలో వున్నాను. దానికి కొన్ని కోర్సులు చెయ్యాల్సివుంది. అవి చేస్తున్నాను." ఉత్సాహంతో చెప్పింది ఉదయిని.

సుజాత గుండెలో రాయి పడింది.

"అమెరికా వెళ్తావా?"

"ఔను మమ్మీ."

"ఎందుకే అంత దూరం? ఇక్కడ జాబ్ వస్తుందిగా!"

"వస్తే వస్తుంది. అమెరికా వెళ్ళడం నా కోరిక."

"అంతా వేలంవెర్రిలా వుందే! ఇక్కడేం తక్కువ?"

"నువ్వేమైనా అనుకోమమ్మీ!" నిర్లక్ష్యంగా అన్నది ఉదయిని.

సుజాతకు రామ్‌గోపాల్ మీద కోపం వచ్చింది. ఇదంతా అతని ప్రోద్బలమై వుంటుంది. లోగడ ఎప్పుడూ కెరీర్, అమెరికా పదాలు ఉచ్ఛరించని ఉదయిని అతను వచ్చిన దగ్గర్నుంచీ అవే జపం చేస్తున్నది. ఆమెకు దుఃఖం ముంచుకొచ్చింది.

ఉదయిని ఇంజనీరింగ్ డిగ్రీ తీసుకుని, కంప్యూటర్ కోర్సులు చేసి అమెరికా వెళ్ళడానికి సిద్ధమైపోతోంది.

"నువ్వు వెళ్ళిపోతే నేను ఒంటరిగా ఎలా వుండగలనే!" దిగులుగా అన్నది సుజాత.

"ముందు నేను వెళ్ళనీ. ఆ తర్వాత నిన్నుగూడా తీసుకెళ్తాను."

"నేను అక్కడికి రానే! నాకు అక్కడేం తోస్తుంది? చాలామందిని చూశాను. విజిటింగ్ వీసా మీద పిల్లల దగ్గరకెళ్ళి అక్కడ ఏం తోచక నరక యాతనట."

ఉదయిని పకపక నవ్వింది.

కూతుర్ని చూస్తుంటే సుజాతకు దిగులుగా వుంది. మోహన్ వెళ్ళిపోయినప్పుడు లోకం తెలియని పసికూన. గుండెల మీద పెట్టుకుని పెంచింది. కూతురే జీవితంగా బ్రతికింది. అదే లోకంగా అనుకుంది. కాని రెక్కలొచ్చిన పక్షిలా ఎగిరిపోవడానికి సిద్ధపడింది. తల్లి ఎలా ఒంటరి జీవితం గడుపుతుందని కనీసం ఆలోచించనుగూడా లేదు. ఎంత స్వార్థం? ఎంతసేపూ తన కెరీర్ తన కోరికలు?

సుజాత ఆవేదనలో మునిగిపోయింది.

ఒక రోజు తల్లిని అడిగింది ఉదయిని.

**(మిగతా 12వ పేజీలో)**

# అంతులేని మంచు మనిషి అన్వేషణ!



శతాబ్దాలుగా మానవుడి అన్వేషణ మేధస్సుకు ఓ సవాలుగానే ఉంటోంది. మంచు మనిషి (యేతి) అస్తిత్వం గురించి ఇప్పుడు మళ్లీ చర్చ మొదలైంది. నేపాల్ వైపు ఉన్న హిమాలయాల్లో ఈ మంచు మనిషికి చెందిన పాద ముద్రలు స్పష్టంగా పడి ఉండడం అమెరికాకు చెందిన 'డెస్టినేషన్ ట్రెక్' అనే సాహస యాత్రికుల బృందానికి కనిపించింది. నేపాల్ రాజధాని ఖాట్మండునుంచి సుమారు 240 కిలోమీటర్ల దూరంలో జోష్ గేట్స్ బృందం డాక్యుమెంటరీ చిత్రం కోసం వెతుకుతూ ఉండగా మూడు పాదముద్రలు వారి కంట పడ్డాయి. రాళ్లు, మట్టి ఉన్న ప్రాంతంలో ఒక పాదముద్ర స్పష్టంగా కనిపిస్తూ ఉండగా, మిగతా రెండూ సగం మాత్రమే ఉన్నాయి. ఈ పాదముద్ర ఆకారం, విస్తారం గమనించినట్లయితే మామూలు మనిషి పాదముద్రకు రెండింతలుంది. పాదం గుర్తు పొడవే 33 సెంటీమీటర్లు ఉంది. అయిదు వేళ్ల గుర్తులు కూడా స్పష్టంగా ఉన్నాయి. వెడల్పు మొత్తం 29 సెంటీమీటర్లుంది. ఈ పాదముద్ర ఆకారంతో అంచనా వేసినట్లయితే మంచు మనిషి ఎత్తు 2.4 మీటర్లు ఉంటుంది!

అయితే నేపాల్ టూరిజం శాఖ మాత్రం మంచు మనిషి పాదముద్రలను కనుగొన్నామని ఈ బృందం చేస్తున్న వాదనలపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఉంది. అవి మంచు ఎలుగు పాదముద్రలై ఉండవచ్చని కూడా అంటోంది. అయితే హిమాలయ పర్వత ప్రాంతాల్లో చింపాజీ లాంటి దైత్యాకారపు ప్రాణి సంచారానికి సంబంధించి అనేక కథలు కూడా ఎప్పటినుంచో వినిపిస్తూ ఉన్నాయి. అయితే ఆ ప్రాణిని ఎవరూ చూడలేదనేది మాత్రం నిజం.హిమాలయ శిఖరాలను అధిరోహించిన పర్వతారోహకులు సైతం అక్కడి మంచులో దైత్యాకారపు ప్రాణి పాదగుర్తులను కనుగొన్నట్లు చెప్పారు. 1953లో మొట్టమొదటిసారిగా కాంచనగంగ శిఖరాన్ని అధిరోహించిన టెన్సింగ్ నార్కే, ఎడ్మండ్ హిల్లరి కూడా ఈ విషయమై తమ ఆత్మకథలో చెప్పుకున్నారు. ఇప్పుడు జోష్ బృందం ఈ పాదముద్రల జెరాక్స్‌లను తీసుకువెళ్లి అమెరికాలో పరిశోధనలు జరపబోతోంది. ప్రపంచవ్యాప్తంగా ఈ మంచు మనిషికి సంబంధించిన వార్త ఆసక్తిని రేకెత్తించిన మాట నిజం. అయితే ఆ దైత్యాకారం మాత్రం ఇంకా దాగుడుమూతలు ఆడుతూనే ఉంది!

**-ఆర్కే**

(9వ పజీ తరువాయి)

"మమ్మీ! రామ్‌గోపాల్ గురించి నీ అభిప్రాయం ఏమిటి?" సుజాత స్థాణువైపోయింది.

"అతని గురించి నా అభిప్రాయం ఎందుకు?"సీరియస్‌గా అన్నది.

"ఇన్నాళ్ళ నుంచి చూస్తున్నావు గదా! జెంటిల్‌మేన్ అవునా? కాదా?"

"అతను జెంటిల్‌మేన్ ఐతే నాకేంటి? కాకపోతే నాకేంటి?"

"నాకు కావాలి."

"ఏంటే పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతున్నావు. కొంపదీసి అతన్ని చేసుకుంటావా ఏం?" ఆందోళనతో అడిగింది.

ఉదయిని చలించలేదు.

"ఏం చేసుకోగూడదా? ఏం తక్కువ?"

"నోర్ముయ్! అతని వయసెక్కడ? నీ వయసు ఎంత? నీ తండ్రి వయసుంది అతనికి. బుద్ధిలేదూ? ఎవరూ దొరకనట్లు తండ్రి వయసువాడిని ఇష్టపడతావా? ఏం చదువులే నీవి? చట్టుబండలు." గట్టిగా కేకలు పెట్టింది సుజాత.

"పోనీ నీ వయసుకి సరిపోతాడుగా నువ్వు చేసుకో" అన్నది. సుజాత మండిపడింది.

"కూల్... కూల్...! మమ్మీ! నీ కోపం నాకు తెలుసు. నేను ఇన్నాళ్ళూ నీ పెంపకంలో పెరిగి పెద్దదాన్నయిపోయి, నిన్ను పట్టించుకోకుండా వెళ్ళిపోతున్నానని వర్రీ అవుతున్నావు. కాని నేను అనుక్షణం నీ గురించి ఆలోచిస్తున్నాను. నా గురించి నువ్వు ఆలోచించేదానికన్నా ఎక్కువ ఆలోచిస్తున్నాను. డాడీ నిన్ను వదిలి వెళ్ళిపోయిన తర్వాత నువ్వు ఏం సుఖపడలేదు. ఒంటరిగా జీవించావు. ఇప్పుడు నేను గూడా వెళ్ళిపోతాను. తర్వాత నీకు ఏముంది? నిన్ను పలకరించేవాళ్ళు ఎవరు?"

సుజాతకు దుఃఖం ముంచుకొచ్చింది. ఉదయిని తల్లి చేతులు పట్టుకుని అన్నది.

"మమ్మీ! నన్ను చిన్న పిల్లని తీసి పారెయ్యకు. నువ్వు ఇన్నాళ్ళూ ఎలాగో గడిపినా ఇక ముందు అలా జీవించలేవు. నీకిప్పుడు నలభై పైన వున్నాయేమో? ఇప్పుడు లైఫ్ స్పాన్ పెరిగింది. ఎనభై ఏళ్ళవరకు జీవిస్తావు. ఎంతో జీవితం వుంది. ఇలా ఒంటరిగా వుంటే పిచ్చిదానివై పోతావు. నీకు తోడు కావాలి."

సుజాత కళ్ళు తుడుచుకుని కూతురు వైపు ఆశ్చర్యంగా చూసింది.

"జీవితం ఒక ఇల్లు లాంటిది. అందులో వున్న రెండు పోర్షన్‌లలో ఒకటి ఎప్పుడూ ఖాళీగా వుండగూడదు. టూలెట్ బోర్డు పెట్టినా, పెట్టకపోయినా అందులోకి ఎంటరవ్వడానికి ఎవరో ఒకరు ప్రయత్నం చేస్తూనే వుంటారు."

"ఏమిటే అర్థంలేని మాటలు?"

"అర్థం వున్న మాటలేనమ్మా! నువ్వు మొగుడు లేనిదానివనీ, ఒంటరిగా వుంటున్నావనీ లొంగదీసుకోడానికి ఎందరు ప్రయత్నించలేదు? నువ్వు కఠినంగా వ్యవహరించబట్టి ఎవరూ నిన్ను లోబరుచుకోలేక పోయారు. ఆఖరికి ఆత్మీయులు, బంధువుల మగాళ్ళుగూడా నిన్ను కబళించడానికి చూళ్ళేదా? నాకన్నీ తెలుసమ్మా!"

ఉదయిని ఇప్పుడు కన్న కూతురిలా కాకుండా ఒక స్నేహితురాలిగా కనిపిస్తోంది సుజాత కళ్ళకు.

"రాజగోపాల్ మొదటిసారి మన ఇంటికి వచ్చి నిన్ను కలిసినప్పుడు, మాట్లాడినదంతా విన్నాను. వారిద్దరూ ఒకప్పుడు ప్రేమికులు. అనివార్య కారణాలవలన విడిపోయారు. యాదృచ్ఛికంగా 'టూలెట్' బోర్డు చూసి ఇంటికి వచ్చాడు. కాని తను మళ్ళీ ఎక్కడ నీ ఆకర్షణలో పడిపోతానో అని! ఎదిగిన కూతుర్ని ఇంట్లో పెట్టుకుని ఇప్పుడు చనువుగా వుండడం మంచిది కాదనీ అతనికి పై పోర్షన్ అద్దెకు ఇవ్వడానికి నిరాకరించావు. అతను ఎంతో బ్రతిమాలి భంగపడి వెళ్ళిపోతున్నాడు. నేను ఏమీ ఎరగనట్లు ఇంట్లోకి తీసుకుని వచ్చాను." చెప్పింది ఉదయిని.

ఉదయిని మాటలు విని జరిగినదంతా కళ్ళకు కట్టేటట్లు గుర్తుకు తెచ్చుకుంది. తను కూతురు అతని ఆకర్షణలో పడిపోతుందేమోనని భయపడింది. కాని దానికి అంతా తెలుసున్నమాట అనుకుంది.

"మమ్మీ! కాలంతోపాటు పరిగెత్తితేనే సుఖంగా వుంటాం. నువ్వు అన్నీ మర్చిపోయి రాజగోపాల్‌ని పెళ్ళిచేసుకో. జీవితాంతం నీకు తోడుగా వుంటాడు."

సుజాత అయోమయంగా చూసింది. ఉదయిని తల్లి భుజం చుట్టూ చేతులు వేసి దగ్గరకు తీసుకుంది.

"ఎవరేమనుకుంటారో? ఏమిటో అన్న ఆలోచనలు నీ మనసులో నుంచి తుడిచెయ్. నీ జీవితం. నీ ఇష్టం. ఇక టూ లెట్ బోర్డు తీసెయ్" అన్నది ఉదయిని.

సుజాతకు నోట మాట రావడంలేదు.

ఉదయిని రాజగోపాల్‌కోసం మేడపైకి పరిగెత్తింది.